కేంద్ర మంత్రి మాంఝీ మనవరాలి హత్య

నాటు తుపాకీతో కాల్చిచంపిన భర్త

గయా, ఏప్రిల్ 9: కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ మనవరాలిని ఆమె భర్త కాల్చి చంపిన దారుణ ఘటన బీహార్‌లోని గయాలో బుధవారం చోటుచేసుకుంది. టెటువా గ్రామంలోని తన ఇంట్లో బాధితురాలు సుష్మా దేవి, ఆమె పిల్లలు, సోదరి పూనమ్ కుమారి ఉండగా ఈ ఘటన జరిగింది. తన మనవరాలి హత్యపై గయా ఎంపీ కూడా అయిన మాంఝీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. మృతురాలి సోదరి పూనమ్ కథనం ప్రకారం.. పని నుంచి ఇంటికి వచ్చిన తర్వాత మధ్యాహ్నం12 గంటలకు సుష్మాకు, ఆమె భర్త రమేశ్‌కు తీవ్ర ఘర్షణ జరిగింది. దీంతో రమేశ్ నాటు తుపాకీతో కాల్చడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. తర్వాత రమేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. సుష్మా 'వికాస్ మిత్ర'గా పనిచేస్తుండగా, ఆమె భర్త రమేశ్ ట్రక్కు డ్రైవర్‌గా ఉన్నాడు. వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వీరిద్దరూ 14 ఏండ్ల క్రితం వివాహం చేసుకున్నారు. తన సోదరిని చంపిన రమేశ్‌ను ఉరితీయాలని పూనమ్ డిమాండ్ చేశారు.

ఆధార్ డిజిటల్ ధ్రువీకరణకు యాప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ధ్రువీకరణ కోసం ఆధార్ కార్డునో లేక దాని జిరాక్స్ కాపీనో మనం వెంట తీసుకువెళ్లాల్సిన అవసరం ఇక ఉండదు. గుర్తింపు ధ్రువీకరణను సురక్షితంగా, డిజిటల్‌గా, పేపర్ రహితంగా చేయడానికి రూపొందించిన ఆధార్ యాప్‌ను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ప్రారంభించారు. క్యూఆర్ కోడ్‌తో తక్షణ వెరిఫికేషన్, రియల్ టైం ముఖ ధ్రువీకరణ వంటి ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయి. 100 శాతం డిజిటల్ విధానంలో పనిచేస్తుంది కాబట్టి ఇక నుంచి వినియోగదారులు ఆధార్ ఫొటో కాపీలు, ప్లాస్టిక్ కార్డులు తమ వెంట తీసుకుని వెళ్లనక్కర్లేదు. ప్రస్తుతం బీటా టెస్టింగ్‌లో ఉన్న ఈ యాప్‌ను త్వరలోనే దేశమంతటా ప్రవేశపెడతారు. ఇది అమలులోకి వస్తే ఇక నుంచి ఎయిర్‌పోర్టులు, హోటళ్లు, ప్రభుత్వ సేవలు, ఇతర ప్రదేశాల్లో భౌతిక ఆధార్ కార్డులను ఐడీ ధ్రువీకరణగా చూపించాల్సిన అవసరం ఉండదు. స్కానింగ్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా తక్షణమే ఆధార్ ధ్రువీకరించుకోవచ్చు

కాపురంలో చిచ్చురేపిన నీటి ఎద్దడి!

- భర్తను వదిలేసి వెళ్లిపోయిన భార్య
- భర్త ఫిర్యాదుతో ఎట్టకేలకు పైప్‌లైన్ వర్క్ ప్రారంభం
- బీజేపీ పాలిత ఎంపీలో ఘటన

డబుల్ ఇంజిన్ ట్రబుల్

భోపాల్, ఏప్రిల్ 9: గ్రామంలో ఏర్పడిన నీటి ఎద్దడి ఓ కుటుంబంలో చిచ్చురేపింది. మంచినీళ్లు లేని ఊళ్లో తాను ఉండలేనంటూ ఓ ఇల్లాలు తన భర్తను వదిలి పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. మధ్యప్రదేశ్‌లోని దేవ్ర గ్రామంలో జరిగిన ఆ ఘటన మంగళవారం వెలుగుచూసింది. దేవ్ర గ్రామంలో నివసించే జితేంద్ర సోని రోజువారీ కూలీ చేసుకుని బతికే కార్మికుడు. జిల్లా ప్రధాన కార్యాలయానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవ్ర గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రస్థాయిలో ఉంది. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బోరు బావి వద్ద బిందెడు నీళ్ల కోసం గ్రామస్థులు రోజంతా బారులు తీరి ఉండాల్సిందే. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకును ప్రభుత్వం నిర్మించినా దానికి నీటి సరఫరా ఏర్పాట్లు లేవు. గ్రామంలో నల్లా కనెక్షన్లు అసలే లేవు. నీటి సమస్యను భరించలేక తన భార్య పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయిందని, పిల్లల చదువులు దెబ్బతింటాయని చెప్పినా భవిష్యత్తు లేని గ్రామంలో తన పిల్లలు ఏం బాగుపడతారని ఆమె నిలదీసిందని జితేంద్ర జిల్లా అధికారుల వద్ద వాపోయాడు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజారోగ్య ఇంజనీరింగ్(పీహెచ్ఈ) శాఖను ఆదేశించారు.

అవినీతిలో సిద్ధూ సర్కార్ నం.1

- సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే బాంబు
- సీఎం ఆర్థిక సలహాదారే సంచలన ఆరోపణలు
- రాయరెడ్డి వ్యాఖ్యలతో రాజకీయ ప్రకంపనలు
- సిద్ధరామయ్య రాజీనామాకు ప్రతిపక్ష బీజేపీ డిమాండ్

బసవరాజ్ రాయరెడ్డి

సిద్ధరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి పెచ్చుమీరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆర్థిక సలహాదారు బసవరాజ్ రాయరెడ్డి సొంత ప్రభుత్వంపై బాంబు పేల్చారు. సిద్ధరామయ్య ప్రభుత్వం దేశంలోనే నంబర్ వన్ అవినీతి ప్రభుత్వమంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై సొంత పార్టీ ఎమ్మెల్యే కూడా అయిన రాయరెడ్డి ఈ స్థాయిలో ఆరోపణలు చేయడంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా చేయాలన్న డిమాండు ఉధృతమైంది. కొప్పల్‌లో మంగళవారం జరిగిన ప్రాంతీయ అసమానత పరిష్కార కమిటీ సమావేశంలో రాయరెడ్డి ప్రసంగిస్తూ అవినీతిలో కర్ణాటక ప్రభుత్వం దేశంలోనే నంబర్ వన్‌గా మారిందని కుండబద్దలు కొట్టారు. "కర్ణాటకలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అవినీతి మాత్రం కార్చిచ్చులా రగులుతోంది. అవినీతి విషయానికి వస్తే కర్ణాటక దేశంలోనే నంబర్ వన్" అని ఆరోపించారు. రాష్ట్రంలో పెచ్చరిల్లిన అవినీతి కారణంగా ప్రభుత్వ మౌలిక సౌకర్యాల ప్రాజెక్టులు నాసిరకంగా ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ప్రభుత్వ భవనాలు ఐదారు దశాబ్దాల పాటు దృఢంగా ఉండేవని, ఇప్పుడు పట్టుమని పదేళ్లకే కుప్పకూలుతున్నాయని విమర్శించారు. అవినీతి కారణంగానే నిర్మాణ ప్రమాణాలు దిగజారుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే కళ్యాణ కర్ణాటకలో మితిమీరిన అవినీతి ఉందని రాయరెడ్డి చెప్పారు.

రాష్ట్ర ప్రతిష్ఠను నాశనం చేశారు..

సొంత ప్రభుత్వంపై రాయరెడ్డి చేసిన ఆరోపణలు ప్రతిపక్ష బీజేపీకి అస్త్రంగా మారాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నాయకుడు సుధా హల్కి డిమాండు చేశారు. "ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారు తన మనసులో మాట చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న భారీ స్థాయి అవినీతిని ఆయన బట్టబయలు చేశారు. ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి" అని హల్కి డిమాండు చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో అవినీతి, లూటీలు వేళ్లూనుకుపోయాయని, బసవరాజ్ రాయరెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వ అవినీతిని బహిర్గతం చేయడంతోపాటు రాష్ట్ర ప్రతిష్టను మసకబార్చాయని ఆయన తెలిపారు. రాయరెడ్డి వెల్లడించిన వాస్తవాలతో ప్రపంచ వేదికపై రాష్ట్ర ప్రతిష్ట నాశనమైందని మండిపడ్డారు.

ఆర్థికం హస్తవ్యస్తం..

సిద్ధరామయ్య ప్రభుత్వ అవినీతిపై గతంలో కూడా తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ రాష్ట్ర చరిత్రలోనే అత్యంత అవినీతి ప్రభుత్వంగా సిద్ధరామయ్య సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో అవినీతికి, ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి అర్థవంతమైన పెట్టుబడులను విస్మరించి ఉచితాలకే అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఒకప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న కర్ణాటకను సిద్ధరామయ్య రెవెన్యూ లోటు రాష్ట్రంగా మార్చారని ఆయన విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై రూ.22,000 కోట్ల రెవెన్యూ మిగులుతో అధికారాన్ని అప్పగించగా సిద్ధరామయ్య రూ.4,000 కోట్ల రెవెన్యూ లోటుకు రాష్ట్రాన్ని మార్చారని మోహన్‌దాస్ విమర్శించారు. ఈ ఏడాది మరో 27,000 కోట్ల లోటును తెచ్చారని, ఉచితాలపై నిధులు ఖర్చు పెడుతుంటే అభివృద్ధి ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు. మోహన్‌దాస్ విమర్శలు రాజకీయంగా దుమారాన్ని రేపాయి.

వైద్యుడికి 13,800 కోట్ల జరిమానా

- అమెరికా కోర్టు సంచలన తీర్పు
- 100 మంది బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడు

న్యూయార్క్, ఏప్రిల్ 9: తమపై లైంగిక దాడికి పాల్పడినట్టు 100 మందికిపైగా బాలికల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న పిల్లల వైద్యుడు స్టువర్ట్ కాపర్‌మ్యాన్‌ను 160 కోట్ల డాలర్ల (రూ.13,867 కోట్లు) నష్టపరిహారాన్ని చెల్లించవలసిందిగా న్యూయార్క్ సుప్రీంకోర్టు ఆదేశించింది. 1980వ దశకంలో లాంగ్ ఐల్యాండ్‌లో ప్రాక్టీసు చేస్తున్న కాలంలో కాపర్‌మ్యాన్ చికిత్స నిమిత్తం తన వద్దకు వచ్చిన బాలికలపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఆరోపణలు నమోదయ్యాయి. అతనిపై డజన్ల సంఖ్యలో ఆరోపణలు వచ్చినప్పటికీ నేరానికి పాల్పడినట్టు అతనిపై కేసు నమోదు కాలేదు. తన 65వ ఏట రిటైర్‌మెంట్‌కు దగ్గరవుతున్న సమయంలో అతని మెడికల్ లైసెన్సు రద్దయ్యింది. సౌత్ ఫ్లోరిడాలో నివసిస్తున్న కాపర్‌మ్యాన్ వయసు ఇప్పుడు 89 ఏళ్లు. తన వద్దకు వచ్చే రోగులకు తాను క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించానే తప్ప వారిపై లైంగిక దాడికి పాల్పడలేదని కాపర్‌మ్యాన్ వాదించాడు. అయితే తమ తల్లిదండ్రులను బలవంతంగా బయటకు పంపించి తమపై డాక్టర్ లైంగిక దాడికి పాల్పడేవాడని అతని పూర్వ రోగులు కోర్టుకు తెలిపారు. నష్టపరిహారంగా 2.5 కోట్ల డాలర్ల(రూ. 160 కోట్లు) పొందిన రెవరెండ్ డబ్బీ రోడ్స్ తీర్పుపై స్పందిస్తూ .ఇన్నేళ్లు శిక్ష నుంచి తప్పించుకున్న డాక్టర్‌కు ఎట్టకేలకు శిక్ష పడిందని చెప్పారు.

రోడ్డు ప్రమాద బాధితులకు

నగదు రహిత వైద్యంపై ఇంత జాప్యమా?

- కేంద్రానికి సుప్రీం మొట్టికాయలు
- వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: మోటారు వాహన ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స అందించే పథకాన్ని రూపొందించడంలో ఆలస్యంపై కేంద్రానికి సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శికి బుధవారం సమన్లు జారీ చేసింది. దీనిపై తాము జనవరి 8న జారీ చేసిన ఉత్తర్వును పాటించకపోవడం పట్ల జస్టిస్‌లు ఎస్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. 'పథకం రూపకల్పనకు మేము మంజూరు చేసిన గడువు 2025 మార్చి 15తో ముగిసింది. ఇది కేవలం న్యాయస్థానం ఉత్తర్వులు ఉల్లంఘించడమే కాక, చాలా ప్రయోజనకారియైన చట్టాన్ని అమలు చేయకుండా ధిక్కరించడమే' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో ఏప్రిల్ 28న తమ ముందు హాజరై కోర్టు ఆదేశాలను ఎందుకు పూర్తి చేయలేదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఉన్నతాధికారులను న్యాయస్థానానికి పిలిచినప్పుడే వారు కోర్టు ఆదేశాలను తీవ్రంగా పరిగణిస్తారని పేర్కొంది. కాగా, ఈ చట్టం రూపకల్పనలో కొన్ని ఇబ్బందులున్నాయని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జీత్ బెనర్జీ న్యాయస్థానానికి తెలిపారు.

కండరాలు బలంగా ఉంటే

మధుమేహం దూరం!

న్యూఢిల్లీ: కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు 44 శాతం తగ్గుతుందని వెల్లడైంది. యూకే బయోబ్యాంక్ నుంచి 1.4 లక్షల మంది సమాచారాన్ని విశ్లేషించి హాంకాంగ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు ఈ విషయం తేల్చారు. మధుమేహం ముప్పు అధికంగా ఉన్నవారి కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు వృద్ధి చెందే అవకాశాలు తగ్గుతాయని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక బయోమెడ్ సెంట్రల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హాంకాంగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యంగ్వన్ కిమ్ మాట్లాడుతూ, వారానికి రెండు రోజులు, 150-300 నిమిషాలపాటు కండరాల పటిష్టత కోసం కృషి చేయాలని తెలిపారు. కండరాల పటిష్టత ఓవరాల్ ఫిట్‌నెస్‌కు ముఖ్యమని చెప్పారు. నడి వయసు నుంచి వృద్ధాప్యం వరకు టైప్-2 మధుమేహం ముప్పును ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలో తేలిందని ఆయన చెప్పారు.

63 వేల కోట్లతో

26 రాఫెల్ జెట్ల కొనుగోలు

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: రాఫెల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్‌తో భారత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనున్నది. రూ.63,000 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో భాగంగా 26 యుద్ధ విమానాలను భారత్ కొనుగోలు చేయనున్నది. ఇందుకు సంబంధించి మరి కొన్ని వారాలలో ఒప్పందం జరగనున్నది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ(సీసీఎస్) ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపింది. వాయుదళ శక్తిని పటిష్టం చేసే లక్ష్యంతో రాఫెల్ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. శక్తివంతమైన ఆధునిక ఆయుధ వ్యవస్థలను కలిగి ఉండే రాఫెల్ యుద్ధ విమానాలు భారత నౌకాదళ పోరాట శక్తిని బలోపేతం చేస్తాయి. నాలుగేళ్లలో రాఫెల్ యుద్ధ విమానాల సరఫరా ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

తెలుగు ఉద్యోగులపై

అమెరికన్ కంపెనీ వేటు

- డొనేషన్ స్కామ్‌కు పాల్పడినట్టు ఆరోపణలు
- తానా వంటి సంస్థలతో కుమ్మక్కై నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు అభియోగాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ఫానీ మే అనే అమెరికన్ కంపెనీ దాదాపు 700 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. వీరిలో 200 మందిని నైతికత కారణాలపై కంపెనీ తొలగించింది. వీరిలో తెలుగువారే అత్యధికంగా ఉన్నట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఫానీ మేలో పనిచేస్తున్న వీరందరినీ నైతికత కారణంపై బుధ, గురువారాలలో కంపెనీ తొలగించింది. మ్యాచింగ్ గ్రాంట్స్ ప్రోగ్రామ్‌లో అక్రమాలకు, నిధుల దుర్వినియోగానికి వీరు పాల్పడినట్టు కంపెనీ అభియోగాలు మోపినట్టు తెలుస్తోంది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) వంటి స్వచ్ఛంద సంస్థలతో కుమ్మక్కై కంపెనీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు కంపెనీ ఆరోపిస్తోంది. ఇదే కుంభకోణానికి సంబంధించి యాపిల్ కంపెనీ ఈ ఏడాది ప్రారంభంలో కొందరు భారతీయ ఉద్యోగులను తొలగించడం గమనార్హం. ఈ కుంభకోణంలో తానా మాత్రమే కాక ఇతర సంస్థల ప్రమేయం కూడా ఉండవచ్చని సమాచారం. ఈ ఏడాది జనవరిలో తానాకు సంబంధించిన ఇవే ఆరోపణలపై యాపిల్ కంపెనీ 100 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. మ్యాచింగ్ గ్రాంట్స్ ప్రోగ్రామ్ అంటే తమ కంపెనీలో పనిచేసే ఉద్యోగి ఏదైనా స్వచ్ఛంద సంస్థకు విరాళాన్ని అందచేస్తే అంతే మొత్తాన్ని కంపెనీ కూడా ఆ స్వచ్ఛంద సంస్థకు విరాళంగా అందచేస్తుంది. ఆ స్వచ్ఛంద సంస్థతో కుమ్మక్కైన ఉద్యోగి తాను ఇచ్చిన విరాళాన్ని వాపసు తీసుకుని తప్పుడు పద్ధతిలో ఈ డిడక్షన్‌ని పన్ను మినహాయింపు కోసం ఉపయోగించుకుంటున్నట్టు ఆరోపణలు వచ్చాయి.

క్షణాల్లో గుండె జబ్బుల నిర్ధారణ!

బైడెన్, ఒబామా ప్రశంసలు

ఏఐ యాప్‌ను అభివృద్ధి చేసిన హైదరాబాద్ బాలుడు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: వైద్యరంగంలో తెలుగు బాలుడు సిద్ధార్థ్ నంద్యాల ఓ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. ప్రస్తుతం అమెరికాలోని డల్లాస్‌లో నివాసముంటున్న 14 ఏండ్ల సిద్ధార్థ్ తన ఆవిష్కరణతో ఇటు సాంకేతిక రంగాన్ని అటు వైద్య రంగాన్ని అబ్బురపరిచాడు. అతడు ఆవిష్కరించిన యాప్ కృత్రిమే మేధ (ఏఐ) సాయంతో మనిషి గుండె ఆరోగ్యాన్ని నిర్ధారిస్తున్నది. సర్కేడియన్ ఏఐగా పేరుపెట్టిన ఆ పరికరం ఏడు క్షణాలపాటు గుండెచప్పుడు విని, అది ఆరోగ్యంగా ఉన్నదా లేక వ్యాధి బారిన పడిందా అన్నది వెంటనే తేల్చేస్తున్నది. దీంతో ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ఏఐ ప్రొఫెషనల్‌గా సిద్ధార్థ్ రికార్డు సృష్టించాడు. అతడు ఆవిష్కరించిన పరికరంతో ఇప్పటికే వేల మందిని పరీక్షించగా, అమెరికా మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, జో బైడెన్‌ల నుంచి ప్రశంసా పత్రాలను కూడా అందుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన ఈ టీనేజర్ చిన్న వయసులోనే అమెరికా వలస వెళ్లాడు. 2023వ సంవత్సరానికిగాను సిద్ధార్థ్‌ను ఇన్నోవేటర్ ఆఫ్‌ది ఇయర్‌గా ఫ్రిస్కో చాంబర్ ఆఫ్ కామర్స్ ఎంపిక చేసింది. అదే ఏడాది అమెరికా ప్రజాప్రతినిధుల సభ అతడికి గుర్తింపు సర్టిఫికెట్‌ను జారీచేసింది.

మీ గుండె మీతో మాట్లాడితే!

తన పరికరం పని విధానాన్ని సిద్ధార్థ్ వివరిస్తూ.. 'సర్కేడియన్ ఏఐ అనేది ఒక ఆటోమేటెడ్ పరికరం. ఇది ఏడు క్షణాలపాటు గుండె చప్పుడు విని సమగ్ర నివేదికను అందిస్తుంది. మీ గుండె ఆరోగ్యంగా ఉన్నదా లేక ఏమైనా సమస్యలున్నాయా అన్నది వెల్లడిస్తుంది' అని చెప్పాడు. 'మీ గుండె మీతో మాట్లాడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఏఐ సహకారంతో పనిచేసే ఈ పరికరం మీ గుండె అంతర్దృష్టిని అందిస్తుంది' అని అన్నాడు. ఈ యాప్‌ను గుండె వద్ద ఏడు క్షణాల పాటు ఉంచితే అది 40 రకాల గుండె సంబంధిత వ్యాధులను పసిగడుతుంది అని తెలిపాడు. అమెరికాలో 15 వేల మందిని భారత్‌లో 700 మందినిని, గుంటూరు,విజయవాడ ప్రభుత్వ దవాఖానల్లో 992 మందిని పరీక్షించగా 19 మంది హృద్రోగులు ఉన్నట్టు వెల్లడైంది. ఆ తరువాత వీరికి టూ(2)డీ ఈకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించగా సర్కేడియన్ పరికరం తేల్చింది నూటికి నూరు శాతం కరెక్ట్ అని తేలింది. వైద్యరంగానికి సహాయకరంగా ఉండేందుకే దీనిని అభివృద్ధి చేశానని, సొంతానికి కాదని స్పష్టం చేశాడు.

యూఎస్ ఎయిడ్‌పై అమెరికా యూటర్న్

వాషింగ్టన్ : యూఎస్ ఎయిడ్‌ను నిలిపివేస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై అగ్రరాజ్యం యూటర్న్ తీసుకుంది. పొరపాటున దానిని నిలిపివేశామని, దానిని పునరుద్ధరిస్తున్నామని తాజాగా ప్రకటించింది. యూఎస్ ఎయిడ్ నిలిపివేతలో భాగంగా ఇటీవల 14 దేశాలకు ఆహార సహాయాన్ని బంద్ చేసిన అమెరికా జరిగిన పొరపాటును గ్రహించి ప్రపంచ ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించిన మానవతా సహాయ ఒప్పందాలను పునరుద్ధరించినట్టు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. యూఎస్ ఎయిడ్‌ను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయంవల్ల ఆకలి చావులు సంభవిస్తాయని, పథకాన్ని పునరుద్ధరించాలని ఐరాస కోరింది.

డేరా బాబాకు మళ్లీ పెరోల్

న్యూఢిల్లీ : అత్యాచారం, హత్య కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్‌కు మరోసారి పెరోల్ మంజూరైంది. ఆయన దోషి అని 2017లో తీర్పు వెలువడిన తర్వాత ఆయనకు హర్యానా ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం కల్పించడం ఇది 13వ సారి. ఈసారి ఆయన జైలు బయట 21 రోజుల పాటు గడపవచ్చు. ఇద్దరిపై అత్యాచారం చేసినట్లు రుజువు కావడంతో ఆయనకు 20 సంవత్సరాల జైలు శిక్ష, మరో రెండు హత్య కేసుల్లో జీవిత ఖైదు పడిన సంగతి తెలిసిందే. గతంలో ఎన్నికలకు ముందు ఆయనకు పెరోల్ లభిస్తుండటంపై విమర్శలు వచ్చాయి.

బంగ్లాకు ట్రాన్స్

షిప్‌మెంట్ సౌకర్యం రద్దు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ నుంచి ఇతర దేశాలకు భారత భూభాగం గుండా రవాణా చేసుకోవడానికి బంగ్లాదేశ్‌కు ఇచ్చిన అనుమతిని భారత ప్రభుత్వం మంగళ వారం రద్దు చేసింది. ఇండియన్ లాండ్ కస్టమ్స్ స్టేషన్స్ (ఎల్‌సీఎస్), నౌకాశ్రయాలు, విమానాశ్రయాల గుండా నేపాల్, భూటాన్, మయన్మార్‌లకు బంగ్లాదేశ్ వివిధ వస్తువులను రవాణా చేస్తుండేది. దీనిని రద్దు చేస్తూ పరోక్ష పన్నులు, సుంకాల కేంద్ర బోర్డు మంగళవారం సర్క్యులర్‌ను జారీ చేసింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ ఇటీవల చైనాలో నాలుగు రోజులపాటు పర్యటించారు. ఈశాన్య రాష్ర్టాల చుట్టూ భూమి మాత్రమే ఉందని, సముద్రానికి చేరుకునే మార్గం లేదని చెప్పారు.

స్పెర్మ్ ట్రాన్స్‌ప్లాంట్‌తో వంధ్యత్వానికి చెక్!

ప్రపంచంలోనే తొలిసారిగా అమెరికా యువకుడికి చికిత్స



న్యూయార్క్: వంధ్యత్వానికి చెక్ పెట్టే దిశగా అమెరికా శాస్త్రవేత్తలు పురోగతి సాధించారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా స్పెర్మ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ చేయడంలో విజయవంతమయ్యారు. అజోస్పెర్మియా (సీమెన్‌లో స్పెర్మ్ లేకపోవడం)తో బాధపడుతున్న అమెరికాకు చెందిన జైమెన్ హ్సు అనే వ్యక్తికి శాస్త్రవేత్తలు విజయవంతంగా స్పెర్మ్ సెల్‌ను ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. తద్వారా అతనికి తండ్రి అయ్యే భాగ్యాన్ని కలిగించారు. పెన్సిల్వేనియాలోని యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్ మెడికల్ సెంటర్ పరిశోధకులు ఈ అద్భుతాన్ని సాధించారు. హార్మోన్ల అసమతుల్యత, హార్మోన్లు సక్రమంగా పనిచేయకపోవడం, పునరుత్పత్తి వ్యవస్థలో అడ్డంకులు, జన్యుపరమైన లోపాల కారణంగా అజోస్పెర్మియా అనే స్థితి తలెత్తుతుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా సుమారు 1% మంది పురుషులపై ప్రభావం చూపుతున్నది. ఇక జైమెన్ విషయానికి వస్తే.. అతనికి చిన్నతనంలో క్యాన్సర్ సోకగా, కీమోథెరపీ చేశారు. ఆ చికిత్స వల్ల జైమెన్ పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం పడింది.

ట్రాన్స్‌ప్లాంట్ ఇలా...

జైమెన్‌కు కీమోథెరపీ చేసే ముందు వైద్యులు అతని స్టెమ్ సెల్‌ను భద్రపరిచారు. ఆ స్టెమ్ సెల్‌ను పిట్స్‌బర్గ్ పరిశోధకులు తాజాగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. ఈ సెల్స్ వృషణాల్లో స్పెర్మ్‌ను ఉత్పత్తి చేస్తాయి. అతి త్వరలో జైమెన్ పునరుత్పత్తి వ్యవస్థ స్పెర్మ్‌ను ఉత్పత్తి చేస్తుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, అతి తక్కువ మొత్తంలో స్పెర్మ్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, అందువల్ల అతడు తండ్రి అయ్యేందుకు ఐవీఎఫ్ లాంటి పద్ధతులు అవసరమవుతాయని పరిశోధకులు తెలిపారు.

గర్భాశయ మార్పిడితో శిశు జననం

గర్భాశయ మార్పిడి ద్వారా బ్రిటన్‌లో తొలిసారి ఓ మహిళ ఆడ శిశువుకు జన్మనిచ్చింది. గర్భం దాల్చడానికి వీలులేని ఆరోగ్య సమస్యలో ఉన్న గ్రేస్ డేవిడ్సన్(36) అనే మహిళకు ఆమె అక్క(42) అవయవ దానం చేసింది. రెండేండ్ల క్రితం వైద్యులు అక్క గర్భ సంచిని డేవిడ్సన్‌కు మార్పిడి చేయగా, ఫిబ్రవరి 27న డేవిడ్సన్ పండంటి బిడ్డకి జన్మనిచ్చింది.

వక్ఫ్ చట్టాన్ని అమలుచేయబోం

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టంచేశారు. ఆమె బుధవారం కోల్‌కతాలో జైన మతస్థుల కార్యక్రమంలో మాట్లాడుతూ, తాను మైనారిటీలను, వారి ఆస్తులను కాపాడతానని హామీ ఇచ్చారు. విభజించు, పాలించు విధానాన్ని బెంగాల్‌లో అనుమతించబోమన్నారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితిని చూడాలని, ఈ చట్టాన్ని ఇప్పుడు ఆమోదించి ఉండకూడదని చెప్పారు. మరో వైపు, వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా బెంగాల్‌లో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి.

భారత్‌కు తహవూర్ రాణా అప్పగింత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: ముంబై ఉగ్రదాడి కుట్రదారులలో ఒకడైన తహవూర్ రాణాను అమెరికా ప్రభుత్వం భారత్‌కు అప్పగించింది. తీహార్ కేంద్ర కారాగారంలో అతడిని ఉంచనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో తహవూర్ విచారణను ఎదుర్కొంటాడని వారు చెప్పారు. నిఘా అధికారులు, దర్యాప్తు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం తహవూర్ రాణాను తీసుకుని ప్రత్యేక విమానంలో అమెరికా నుంచి బయల్దేరింది. బుధవారం ఉదయం 7.10 (భారతీయ కాలమానం) గంటలకు బయల్దేరిన విమానం గురువారం మధ్యాహ్నానికి ఢిల్లీ చేరుకుంటుందని వారు చెప్పారు. రాణా ఢిల్లీలో దిగిన వెంటనే ఎన్ఐఏ అతడిని అధికారికంగా అరెస్టు చేసి తీహార్ జైలుకు తరలిస్తుంది. రాణా తరలింపు దృష్ట్యా తీహార్ జైలు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు.

విమానంలో తోటి ప్రయాణికుడిపై మూత్రం

ఢిల్లీ-బ్యాంకాక్ ఎయిరిండియా విమానంలో ఘటన

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానం గాల్లో ఉండగా తుషార్ మసంద్ అనే ప్రయాణికుడు తన ముందు సీట్లో కూర్చున్న హిరోషీ యోషిజనే అనే వ్యక్తిపై మూత్ర విసర్జన చేశాడు. ఢిల్లీ నుంచి బ్యాంకాక్‌కు బయల్దేరిన ఏఐ2336 విమానంలో ఈ ఘటన జరిగింది. బాధితుడు బ్రిడ్జిస్టోన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్. బాధితుడిని విమానం సిబ్బంది టాయిలెట్‌కు తీసుకెళ్లి, తువ్వాలు, ఇతర సామగ్రి ఇచ్చి, శుభ్రం చేసుకోవడానికి సహకరించారు. నిందితుడిని వేరొక సీట్లోకి పంపించేశారు. బాధితుడు ఫిర్యాదు చేసేందుకు నిరాకరించడంతో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు ఎయిరిండియా రిపోర్ట్ చేసింది. బాధితునికి నిందితుడు పదే పదే క్షమాపణలు చెప్పాడు. నిందితుడిని అధికారులు మందలించారు.

కూలిన నైట్‌క్లబ్ పైకప్పు..

124 మంది మృతి

డొమినికన్ రిపబ్లిక్‌లో ఘోర ప్రమాదం

డొమింగో, ఏప్రిల్ 9: కరేబియన్ దేశమైన డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటో డొమింగోలోని ఒక నైట్ క్లబ్ పైకప్పు కూలిన ప్రమాదంలో వంద మందికి పైగా మరణించగా, 155 మంది గాయపడ్డారు. ప్రమాదంలో 124 మంది మరణించారని, మృతులలో ఇద్దరు మేజర్ లీగ్ బాస్కెట్ బాల్ మాజీ క్రీడాకారులు కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. మంగళవారం ఒంటి గంటకు ఒక బ్యాండ్ ప్రదర్శనను తిలకిస్తుండగా, ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో క్లబ్‌లో 300 మంది ఉన్నారు. ప్రదర్శన ఇస్తున్న మెరెంగ్యూ కళాకారుడు రూబీ పెరెజ్ జాడ కూడా తెలియరాలేదు. మృతులలో ఆయన కూడా ఉండి ఉంటారని భావిస్తున్నారు.

రష్యా విక్టరీ డే పరేడ్‌కు మోదీకి ఆహ్వానం

మాస్కో: రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీపై రష్యా విజయాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 80వ వార్షికోత్సవాలకు హాజరుకావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని రష్యా ఆహ్వానించింది. వచ్చే నెల 9న మాస్కోలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. మోదీతోపాటు వివిధ మిత్ర దేశాల అధినేతలను ఈ వేడుకలకు రష్యా ఆహ్వానించింది. 1945 జనవరిలో జర్మనీపై రష్యా దాడి ప్రారంభమైంది. జర్మనీ మే 9న లొంగిపోవడంతో యుద్ధం ముగిసింది.